క్లుప్తంగా

వైభవంగా చండీహోమం



చండీహోమం చేస్తున్న పురోహితులు

భామిని: మండలంలోని వడ్డంగిలో వైఎస్సార్ సీపీ నాయకుడు బోదెపు రఘుపతినాయుడు ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం చండీ యాగం నిర్వహించారు. కోదండ రామాలయం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో బత్తిలి పురోహితుడు రంపా శ్రీనివాసశర్మ, తదితరులు పాల్గొన్నారు.

మునగ మొక్కల పంపిణీ



కిమ్మి గ్రామంలో రైతులకు మునగ మొక్కలు అందజేస్తున్న ఏపీఓ సత్యంనాయుడు

వీరఘట్టం: మండలంలోని కిమ్మి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఏపీఓ జి.సత్యంనాయుడు శుక్రవారం మునగ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం తమ వద్ద ఏడు వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని ఎస్‌హెచ్‌జీ సభ్యుల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల వద్ద నాటిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గురాన రామ్మోహన రావు, కార్యదర్శి తిరుపతిరావు, టీఏ హరి బాబు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామసభ



మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్

జియ్యమ్మవలస: మండలంలోని అర్నాడ గ్రామంలో ఎంపీడీవో రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం పనుల జాబ్‌కార్డులో పేరు ఉండి చనిపోయిన వారి వివరాలు, కొత్తగా జాబ్ కార్డు అవసరమైన వారి వివరాలపై చర్చించారు. జాబ్‌కార్డు ఉన్న వారిలో మొత్తం 41 మంది మృతి చెందినట్లు గాను అలాగే కొత్తగా 52 మందికి జాబ్‌కార్డు అవసరమైనట్లు గుర్తించారు. మృతుల పేర్లు తొలగించేందుకు గ్రామ సభలోని వారంతా ఆమోదం తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



చినమేరంగిలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస: మత్తు పదార్థాలతో జీవితం నాశనమని, ప్రతిఒక్కరూ గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. మండలంలోని బిత్రపాడు గ్రామంలో ఎస్‌ఐ అనీష్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం పర్యటించి, అక్కడి వారికి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత, విద్యార్థులు ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి, చెడు అలవాట్ల బారినపడి తమ బంగారు భవిష్యత్ చెడగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు కూడా పర్యవేక్షణ చేయాలని, ఎప్పటికప్పుడు వారిని మంచి మార్గం వైపు నడిపించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కాసులు, తదితరులు పాల్గొన్నారు.

'పీఎంఎంఎస్‌వై'ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంఎఫ్‌ఏ ఆదినారాయణ

భామిని: చేపల ఉత్పత్తి పెంచి మత్స్యకారులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఎంఎస్‌వై పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఫిషరీస్ సహాయ అధికారి కె. ఆదినారాయణ అన్నారు. మండలంలోని సొలికిరిలో మత్స్యకారుల సంఘ నాయకుడు బర్ల ఆనందరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పథకం ఆవశ్యకతను వివరించారు. ఈ పథకం ద్వారా చేప పిల్లలు పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ చెరువులైన బాలేరు ఊర చెరువు, నులకజోడు మామిడి చెరువులను క్యాప్టివ్ సీడ్ నర్సరీలుగా మార్చనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చెరకు వ్యర్థాలతో ఎరువు..

- భూమిలో తేమ, సత్తువ కాపాడేందుకు దోహదం



చెరకు కొడుతున్న కూలీలు (ఇన్‌సెట్లో) కె.రత్నకుమారి

పాలకొండ రూరల్: ప్రస్తుతం చెరకు పంట చివరి దశకు చేరుకోవడంతో రైతులు పొలాల్లో ఉన్న చెరకును కొట్టి ఫ్యాక్టరీలకు తరలించే పనిలో బిజీగా ఉన్నారు. అ యితే చెరుకు కొట్టిన అనంతరం మిగిలిన వ్యర్థాలను రైతులు సద్వినియోగం చేసుకోవడం లేదు. దీంతో కూడా కంపోస్టు ఎరువును తయారు చేసుకోవచ్చని పాలకొండ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు (ఎ.డి) కె.రత్నకుమారి తెలిపారు. చెరకు వ్యర్థాలను వృథాగా తగలబెట్టేస్తున్నారు. అలా కాకుండా చెరకు తోటల్లో సాళ్ల మధ్య పరిచే సేంద్రియ ఎరువుగా ఈ చెత్తను వినియోగిస్తే ఎకరాకు సరాసరిన ఐదు టన్నుల వరకు దిగుబడి పెంచుకోవచ్చు. సాళ్ల మధ్యలో ఎకరాకు 1.25 టన్నుల చెత్త కప్పడం వల్ల భూమి నుంచి తేమ ఆవిరి కాకుండా ఎక్కువ కాలం కాపాడుకోవచ్చు. కలుపు మొక్కలు పెరగకుండా, పీకపురుగు వృద్ధి చెందకుండా చేయవచ్చు. అలాగే చవుడు, పాల చవుడు భూముల్లో లవణాలు పైకి రాకుండా చేయడంతో పాటు చెరకు చెత్త నేలలో సేంద్రియ ఎరువుగా మారేందుకు ఎకరాకు 10 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 8 కిలోల యూరియా, 1.25 కిలోల కుళ్లబెట్టే శిలీంద్రియాన్ని చెత్తపై చల్లితే శ్రేష్టమైన ఎరువు సిద్ధం చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

కంపోస్టు ఎరువు తయారీ...

చెరకు చెత్తను సేకరించుకుని మీటరు లేదా రెండు మీటర్లు వెడల్పు, ఆరు మీటర్లు పొడవు గోతులను తవ్వి ఈ చెత్తను గోతిలో సమాంతరంగా పరచాలి. దానిపై నీళ్లు జల్లి ఒక కిలో శిలీంద్రియం, 8 కిలోల యూరియా, 10 కిలోల సూపర్‌ఫాస్పేట్ ద్రావణాన్ని కలపడంతో పాటు రెండు సెంటీమీటర్ల మందంలో మట్టి కప్పాలి. ఇలా చేస్తే బలవర్ధకమైన కంపోస్టు ఎరువు నాలుగు నెలల్లో తయారవుతుంది. దీనిని ఏ పంటకైనా వాడుకోవచ్చు. ఈ ఎరువుల్లో నత్రజని 0.41 శాతం, భాస్వరం 0.16 శాతం, పొటాష్ 0.72 శాతం, కాల్షియం, మెగ్నీషియం, మాంగనీస్, ఐరన్, జింక్ 0.2 నుంచి 0.10 శాతం వరకు సమకూరుతాయి. రైతులు తమ చెరకు తోటల్లో ఉన్న వ్యర్థాలను వృథా పోనివ్వకుండా కంపోస్టు ఎరువు తయారు చేసుకోవడంతో వ్యర్థాలను సద్వినియోగం చేసుకోవచ్చు.

ఉద్యోగ భద్రత కల్పించండి

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు కనీస వేతనాలు ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ బోధనా సిబ్బందికి ప్రస్తుతం ఇస్తున్న చాలీచాలని జీతాలతో వారు వారి కుటుంబాలను నెట్టుకురాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వారి వేతనాలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకుల మాదిరిగానే వారికి కూడా వేతనాలు ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం వర్తింపజేయాలని అభ్యర్థించారు.

స్త్రీనిధి రుణాల లక్ష్య సాధనకు కృషి చేయాలి

గుమ్మలక్ష్మీపురం: డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు అందజేసే స్త్రీనిధి రుణాల మంజూరు లక్ష్య సాధనకు సీసీలంతా కృషి చేయాలని వెలుగు ఏజీఎం కె.హేమలత కోరారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఆదయ్య ఆధ్వర్యంలో ఆమె సీసీలతో శుక్రవారం సమావేశమై, ఆమె మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం మండలానికి రూ.3 కోట్ల స్త్రీనిధి రుణాల మంజూరును లక్ష్యంగా విధించడం జరిగిందని తెలిపారు. అయితే ఇప్పటివరకు రూ.1.80 కోట్లు మాత్రమే సభ్యులకు అందజేశారని పేర్కొన్నారు. 2025 మార్చి నాటికి నిర్దేశిత లక్ష్యం చేరుకోవాలన్నారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్త్రీనిధి అనేది మహిళల బ్యాంకు అని, రుణం తీసుకున్న సభ్యులు సులభ పద్ధతిలో తిరిగి చెల్లించేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. స్త్రీనిధి రుణం పొందిన సభ్యులకు రూ.400లతో ఇన్సూరెన్స్ వర్తింపజేయడం జరుగుతుందని, రుణం పొందిన సభ్యురాలు దురదృష్టవశాత్తు మరణించినట్లయితే ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన నగదు నుంచి వసూలు చేయడం జరుగుతుందన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



పారిశుధ్య చర్యలను పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి



కొమరాడ: అవగాహన కల్పిస్తున్న జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలోని తాగునీటి ట్యాంకుల్లో పరిశుభ్రతా చర్యలు శుక్రవారం చేపట్టారు. ట్యాంకుల్లోని నిల్వ నీటిని తొలగించి, శుభ్రం చేసి పరిశుభ్రమైన కొత్త నీరు వాటిల్లో నింపి ఉంచారు. మురుగునీటి నిల్వల కారణంగా దోమలు విపరీతంగా పెరిగి వాటి ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించి వ్యాధుల బారినపడకుండా ఉండాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ: దోమలు లేకుండా చర్యలు చేపడితే మలేరియా వ్యాధిని నిర్మూలించినట్లేనని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ అన్నారు. మండలంలోని విక్రంపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇంట్లో ఫ్రిజ్ వెనుక ఉన్న ట్రేలో చేరిన నీటిలో దోమల లార్వా పెరుగుతుందని దానిని వారానికోసారి ఆ నీటిని తీసివేయాలన్నారు. అలాగే ఇళ్ల ముంగిట, పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు.

జీడితోటల సాగుపై ఆసక్తి చూపాలి



మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ రీజనల్ తీమోటిక్ లీడ్ ప్రకాష్

గరుగుబిల్లి: రైతులంతా జీడితోటల సాగుపై కూడా ఆసక్తి కనబరచాలని రైతు సాధికార సంస్థ రీజనల్ తీమోటిక్ లీడ్ కె.ప్రకాష్ సూచించారు. మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్టు కార్యాలయంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లోని 60 మంది రైతులకు వివిధ పంటల సాగుపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఏక పంట విధానం నుంచి పలు పంటల విధానంలోకి రైతులు మారాలన్నారు. ఓ వైపు జీడి తోటలు పెంచుతూనే వాటిలో పసుపు, అల్లం, పైనాపిల్ తదితర పంటలను కూడా సాగు చేసుకుని, నిరంతర ఆదాయం పొందాలన్నారు. జట్టు ట్రస్టీ డి.పారినాయుడు మాట్లాడుతూ జీడి తోటలు సాగు చేసుకుని, ఆర్థికంగా వృద్ధి చెందాలని ఆకాంక్షించారు. జిల్లా డీపీఎం పి.షణ్ముఖరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి గిరిజ, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన

పాలకొండ రూరల్: మహిళలకు రక్షణగా నిలిచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక శ్రీరామ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమానితుల పట్ల అప్రమత్తంగా మెలగాలని సూచించారు. ఎటువంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా పోలీసుల దృష్టికి లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

29న ఉపకరణాల గుర్తింపు శిబిరం

జియ్యమ్మవలస: కురుపాం మండల కేంద్రంలో ఈ నెల 29వ తేదీన దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల గుర్తింపు నిమిత్తం శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రమేష్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉపకరణాలు అవసరమైన వారు ఆరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలలోపు ఎంపీడీవో కార్యాలయానికి రావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గరుగుబిల్లి: ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి దివ్యాంగులకు సూచించారు. ఈ నెల 29వ తేదీన కురుపాం మండల కేంద్రంలో జరిగే కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ఉపకరణాలు అందజేయడం జరుగుతుందన్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

భామిని: మండల పరిషత్ కార్యాలయంలో పూర్తిస్థాయి సిబ్బంది లేకపోవడంతో ప్రజావసరాలు తీర్చడానికి ఇబ్బంది పడుతున్నామని ఎంపీడీఓ గెండేలా చంద్రరావు అన్నారు. ఈ మేరకు వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావును శుక్రవారం కలిసి సమస్యలు వివరించారు. ఏఓ సీతంపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లారని.. ఈఓపీఆర్‌డీ రెండు నెలలుగా విధులకు హాజరు కావడం లేదన్నారు. అలాగే జూనియర్ సహాయకుడిని కొత్తూరుకు బదిలీ చేశారని, సబార్డినేట్ సిబ్బంది మూడు ఖాళీలు భర్తీ కాలేదన్నారు. వైస్ ఎంపీపీ వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేపల్లి ప్రసాద్, పత్తిక సింహాచలం ఉన్నారు.

బీమా ప్రీమియం చెల్లింపు గడువు పెంచండి



గుమ్మలక్ష్మీపురం: జీడి మామిడి సాగు చేస్తున్న రైతులంతా ఆపత్కాలంలో బీమా పొందేలా ఆ పంటల బీమా ప్రీమియం చెల్లింపు గడువు పొడిగించాలని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి, ప్రీమియం చెల్లించుకొనుటకు ఈ నెల 22వ తేదీ వరకు గడువు ఇచ్చినా, ఇక్కడి గిరిజన రైతులకు అవగాహన లేకపోవడంతో ప్రీమియం చెల్లించేందుకు ఉన్న అవకాశాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

1600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

వీరఘట్టం: మండలంలోని చినగోర కాలనీ సమీపంలో గల తోటలో సారా తయారీకి ఉపయోగించే 1600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై కళాధర్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆ ప్రాంతంలో శుక్రవారం దాడులు చేపట్టామన్నారు. బెల్లంఊట పారబోయగా.. డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప దేవాలయంలో కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. వేద పండితులు ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొని, కీర్తనలు ఆలపిస్తూ భజనలు, పూజలు చేశారు.

పరామర్శలు..



సీతంపేట: మృతుని భార్యను హత్తుకుని కంటతడి పెడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి



వీరఘట్టం: సరోజనమ్మ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

సీతంపేట: మండలంలోని రాజన్నగూడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సవర సిద్దు అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి భార్య ఆశ, పిల్లలు నాని, దేవిశ్రీ బోరున విలపించడంతో వారిని హత్తుకుని మాజీ ఎమ్మెల్యే కూడా కంటతడి పెట్టారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అక్కన్నగూడలో మరోకార్యకర్త సవర మూర్తి మృతి చెందడంతో అతని కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు.

ప్రజా మన్ననలు పొందిన వ్యక్తి సరోజనమ్మ

వీరఘట్టం: స్థానిక పీహెచ్‌సీలో సుదీర్ఘకాలం పనిచేసి ఎంతోమంది పేదలకు సేవలందించి సిస్టర్‌గా ప్రజా మన్ననలు పొందిన మహోన్నత వ్యక్తి సైల సరోజనమ్మ అని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. ఇటీవల సరోజనమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను కళావతి పరామర్శించారు. వీరఘట్టంలో శుక్రవారం నిర్వహించిన జ్ఞాపకార్థ స్తుతి ప్రార్థనా కూడికలో కళావతి పాల్గొని ప్రార్థనలు చేశారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కొణింగ ప్రేమభూషణరావు, నులకజోడు రాజు, బూరాడ చిన్న, భోగి మణి, పిన్నింటి శ్రీను, శంబాన శ్రీను, అంబళ్ల రవి, నులకజోడు సాయిచంద్ తదితరులున్నారు.

రిలే నిరాహార దీక్షలు



గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకున్నాయి. ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు, టీడబ్ల్యూటీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు, గురుకులం రెగ్యులర్ టీచింగ్ అండ్ నాన్‌టీచింగ్ స్టాఫ్ దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ పోస్టులను నమ్ముకుని రెసిడెన్షియల్ ప్యాటర్న్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ స్టాఫ్ సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపక సంఘ నాయకులు బి.గణేష్, బి.. ధర్మారావు, కె.భవానీ, ఎస్.మోహన్‌రావు, కె.మల్లేశ్వరరావు, ఎల్.రవి, కె.బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

– సీతంపేట

తక్షణమే ప్రజాసమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేకాధికారి రామ్‌గోపాల్

కొమరాడ: తక్షణమే ప్రజాసమస్యలు పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ప్రత్యేకాధికారి బి.రామ్‌గోపాల్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో పని చేస్తున్న సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో మల్లిఖార్జునరావుతో కలిసి సమావేశమైన ఆయన.. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మరుగుదొడ్ల సర్వే తదితర అంశాలపై ఆరాతీశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

- ఉప విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి

వీరఘట్టం: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని పాలకొండ ఉప విద్యాశాఖాధికారి పర్రి కృష్ణమూర్తి సూచించారు. కంబరవలస జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతిరోజూ టెన్త్ విద్యార్థులకు ఆన్‌లైన్ టెస్ట్ నిర్వహించాలని హెచ్ఎం వై.లక్ష్మికి, సబ్జెక్ట్ టీచర్లకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనంపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. కిచెన్ గార్డెన్స్‌తో సత్ఫలితాలు వస్తున్న నేపథ్యంలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత అన్ను వెంకటరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించేలా పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాద రాము, ఎం. అప్పలస్వామి, ఎ. లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై చైతన్యవంతులు కావాలి..



గ్రామంలో పర్యటిస్తున్న అధికారుల బృందం

పాలకొండ : పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పనులపై ప్రజలు చైతన్యవంతులు కావాలని మండల ప్రత్యేకాధికారి ఎస్. మన్మధరావు అన్నారు. మండలంలోని కొండాపురంలో శుక్రవారం గ్రామ దర్శిని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశమై స్థానిక సమస్యలపై ఆరాతీశారు. ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మరో రక్షిత మంచినీటి పథకం మంజూరు చేయాలని ఎంపీటీసీ ప్రతినిధి కరణం మురళీ, సర్పంచ్ ప్రతినిధి రాయి రామకృష్ణ కోరారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే రహదారిని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అలవర్చుకోవాలని సూచించారు. ఎంపీడీఓ విజయరంగారావు మాట్లాడుతూ.. మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యేక కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తం..



గర్భిణుల ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండి సరైన పౌష్టికాహారం అందేలా చూడాలని బాలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి దీపికారాణి అన్నారు. మండలంలోని సతివాడ, పెద్దదిమిలి వెల్‌నెస్ సెంటర్లను శుక్రవారం సందర్శించి, గర్భిణులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు.

–భామిని

అవగాహన..

అమిష్ క్రాప్ సైన్స్ విధానంలో భాగంగా మండల కేంద్రంలో కాలీఫ్లవర్ సాగుపై వ్యవసాయాధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. పంటకు ఆశించే రెక్కల పురుగు నివారణపై తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ఈ పురుగు నివారణకు అమిష్ క్రాప్ సైన్స్ వారు రూపొందించిన అల్లు–ఢీ ట్యాబ్లెట్స్ ఎంతగానో ఉపయోగపడతాయని సూచించారు. కార్యక్రమంలో సైంటిస్ట్ డాక్టర్ సతీష్, మండల వ్యవసాయశాఖ అధికారి జక్కువ సౌజన్య, టెక్నికల్ ఏఓ మన్మధరావు, రీజనల్ మేనేజర్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

– వీరఘట్టం



సైబర్‌నేరాలపై అప్రమత్తం



సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. మండలంలోని కత్తులకవిటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చే లింక్‌లను క్లిక్ చేయవద్దని సూచించారు. పొరపాటున అటువంటి లింక్‌లను క్లిక్ చేస్తే మీ తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలు ఖాళీ అవుతాయన్నారు. అలాగే మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

– వీరఘట్టం